సాక్షి
మంచిర్యాల
మంగళవారం । 17 । జూన్ । 2025



..గోదావరిలో దీపమే!

బాసర వద్ద గోదావరిలో భక్తుల ప్రాణాలకు భద్రత కరువైంది. పుణ్యస్నానం కోసం వచ్చిన భక్తులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. భద్రత, రణక్ష చర్యలు కానరావడం లేదు. 8లో▸



రెప్పపాటులో.. రెండు ప్రాణాలు

దైవ దర్శనానికి వెళ్లిన ఆ కుటుంబ సభ్యులు తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. 8లో▸

గరిష్టం/కనిష్టం
33.0 /27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు బలంగా వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

విద్యుత్ ప్రమాదాలు నివారించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో విద్యుత్ ప్రమాదాలను ముందస్తుగా నివారించాలని విద్యుత్‌శాఖ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా విద్యుత్ శాఖ అధికారులతో వరంగల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. వానాకాలం సమీపించినందున లూజ్‌లైన్లు, వంగిన, తుప్పు పట్టిన, తక్కువ ఎత్తులో ఉన్న స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, డబుల్ ఫీడింగ్, లైన్ క్రాసింగ్ తదితర ప్రమాదకరంగా ఉన్న వాటిని వెంటనే మార్చాలని సూచించారు. వ్యవసాయ క్షేత్రాల్లో ప్రమాదకరంగా ఉన్న తీగలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర ముందస్తు సమాచారం అందించేలా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్ఈ గంగాధర్, డీఈలు, ఏడీలు, ఏఈలు పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో వాతావరణ కేంద్రం

బెల్లంపల్లి: బెల్లంపల్లి కేంద్రంగా వాతావరణ కేంద్రం(వెదర్ స్టేషన్) మంజూరైంది. రైతులకు వాతావరణంలో మార్పులు, పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసి పంటల రక్షణ, అధికోత్పత్తికి దోహదపడాలనే ఉద్దేశంతో భారత వాతావరణ శాఖ వాతావరణ కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించింది. బెల్లంపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రాంగణంలో ఏర్పాటుకు సర్వే చేశారు. తగినంత స్థలం, ఇతర పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో త్వరలోనే ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మంచిర్యాల, కుమురంభీం జిల్లాల వాతావరణ పరిస్థితులు ఈ కేంద్రం ద్వారా తెలుసుకోవచ్చు. వర్షపాతం, అధిక, అత్యల్ప ఉష్ణోగ్రతలు, గాలిలో తేమ, గాలి వేగం తదితర వివరాలు తెలుసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం హైదరాబాద్ వాతావరణ కేంద్రం నుంచి అందిస్తున్న సమాచారం ఒక్కోసారి సరిగా ఉండడం లేదనే భావన రైతుల్లో ఉంది. బెల్లంపల్లిలో కేంద్రం ఏర్పాటుతో కచ్చితమైన సమాచారం అందే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వాతావరణ కేంద్రం ఏర్పాటు వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని కేవీకే ప్రోగ్రం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ తెలిపారు.

'మోదీ పాలనలో దేశం అభివృద్ధి'



ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న వెంకటేశ్వర్‌గౌడ్

మంచిర్యాలటౌన్: దేశ ప్రధానిగా 11 ఏళ్ల సుపరిపాలనతో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారిని పైకి తీసుకొచ్చిన ఘనత నరేంద్ర మోదీదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. సోమవారం స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో నరేంద్రమోదీ విజయాలు, అభివృద్ధిపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశప్రజల రక్షణతోపాటు అన్ని వర్గాలకు సమన్యాయం చేసేలా పాలన ఉందని కొనియాడారు. మాజీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి, జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టి వెంకటకృష్ణ, దుర్గం అశోక్, పురుషోత్తం జాజు, పెద్దపల్లి పురుషోత్తం, ఎనగందుల కృష్ణమూర్తి, ఆకుల అశోక్‌వర్ధన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైళ్లు పొడగించాలని వినతి

బెల్లంపల్లి: ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లు పొడగించాలని ఆదిలాబాద్ ఎంపీ గెడం నగేష్‌ను ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం ప్రతినిధి పూదరి రవితేజ కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. బల్లార్షా–కాజీపేట్ ఎక్స్‌ప్రెస్ రైలును చర్లపల్లి టెర్మినల్ వరకు, ముంబయి–బల్లార్షా నందిగ్రామ్ ఎక్స్‌ప్రెస్ రైలును కాజీపేట వరకు పొడగించాలని కోరారు. ఆదిలాబాద్–తిరుపతి వయా మాజ్రీ, బల్లార్షా, మంచిర్యాల మీదుగా విజయవాడ మార్గంలో బై వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు, చర్లపల్లి–సంత్రాగచ్చి వరకు బై వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రవేశ పెట్టాలని అభ్యర్థించారు. ఆయా రైళ్ల పొడగింపునకు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

కలెక్టర్‌కు పది బాధ్యతలు

- రెవెన్యూ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా, డీఆర్వోగా..
- జెడ్పీ, కార్పొరేషన్, మున్సిపాల్టీల ప్రత్యేక అధికారి
- పాలనలోనూ తప్పని అదనపు పనిభారం
- కలెక్టర్‌గా కుమార్ దీపక్ ఏడాది పాలన పూర్తి



కలెక్టర్ కుమార్ దీపక్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లా కలెక్టర్‌కు పది బాధ్యతలు.. అవును. మీరు చదివింది నిజమే. సాధారణంగా కలెక్టర్ అంటేనే జిల్లాకు బాస్. అంటే అన్ని ప్రభుత్వ శాఖలను పర్యవేక్షించే అధికారం ఉంటుంది. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తూ.. పాలన పరంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజా కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాత్రం కొద్ది రోజులుగా పది మంది అధికారులు నిర్వర్తించే బాధ్యతలు ఒక్కరే నిర్వర్తిస్తుండడం గమనార్హం.

అదనపు కలెక్టర్లు లేక..

కీలకమైన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డీఆర్వో(జిల్లా రెవెన్యూ అధికారి) పోస్టు ఎప్పటి నుంచో ఖాళీగా ఉంటోంది. ఈ పోస్టులోనూ అదనపు కలెక్టరే బాధ్యతలు నిర్వర్తించేవారు. ఇక జిల్లా పరిషత్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గాల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక అధికా రిగా ఉన్నారు. అంతేగాక జిల్లాలోని లక్సెట్టిపేట, చెన్నూర్, క్యాతనపల్లి, మందమర్రి, బెల్లంపల్లి మున్సిపాల్టీలకు పాలకవర్గాలు లేక ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తున్నారు.

నిత్యం బిజీగా..

జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్‌గా అన్ని శాఖలను సమన్వ యం చేస్తూ.. కలెక్టర్ హోదాలో పలు కమిటీలకు బాధ్యులుగా ఉంటారు. ప్రతీవారం ప్రజాఫిర్యాదు ల విభాగం నిర్వహించాలి. నిత్యం శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలిస్తూ సమీక్షించాలి. ఇక జిల్లాలో ప్రభుత్వ పరంగా ఏ పని జరగాలన్నా కలెక్టర్ ఆమోదం తప్పనిసరి. కేంద్ర, రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అమలు చే యాల్సి ఉంటుంది. జిల్లాలో అమలు అవుతున్న ఆ యా పథకాలు, కార్యక్రమాల నివేదికను పై అధికా రులకు పంపించాలి. ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కారం చూపాలి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం, భూ భారతి అమలు, రేషన్ కార్డుల జారీ సన్నబియ్యం పంపిణీ, మొన్నటివరకు ధాన్యం కొనుగోళ్లు, మిల్లర్ల నుంచి సీఎంఆర్ రికవరీ వీటితోపాటు విద్యాసంవత్సరం ఆరంభం, ప్రభుత్వ, వసతిగృహాలపై పర్యవేక్షణ, వైద్యం, వానాకాలంలో అప్రమత్తం తదితరవన్నీ పర్యవేక్షిస్తున్నారు.

ఏడాదిపూర్తి

గతేడాది జూన్ 16న కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కుమార్ దీపక్ పాలనకు సోమవారంతో ఏడాది పూర్తయింది. ఆయన కంటే ముందు ఇక్కడ బదావత్ సంతోష్ కలెక్టర్‌గా పని చేశారు. ఇక్కడికే శిక్షణ కలెక్టర్‌గా వచ్చి మొదటిసారి ఓ జిల్లాకు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

అదనపు బాధ్యతలు తీరేనా?

జిల్లాకు ఐఏఎస్ స్థాయి అధికారులు ఇద్దరిని కేటాయిస్తే అదనపు కలెక్టర్ల కొరత తీరుతుంది. ఎప్పటి నుంచో ఖాళీగా ఉన్న జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) ఇక స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌కే అదనంగా ఎన్నికలు జరిగే వరకు ప్రత్యేక అధికారులుగా పని చేయాల్సి ఉంది. మున్సిపల్ ఎన్నికలు జరిగి పాలకవర్గాలు కొలువుదీరితే ఈ అదనపు బాధ్యతలు తప్పే అవకాశం ఉంది. స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నత స్థానాల్లో ఖాళీలు లేకుండా చూడాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

పెండింగ్ అర్జీల వివరాలు ఇవ్వండి



కలెక్టర్ కుమార్ దీపక్‌ను వేడుకుంటున్న వృద్ధురాలు గడుప బాణమ్మ

- ఆలస్యం చేయకుండా పరిష్కరించాలి
- అధికారులకు కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి, సీఎం ప్రజావాణికి జిల్లా నుంచి అందిన అర్జీల పెండింగ్, పరిష్కార వివరాలన్నీ ఎంపీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు మంగళవారం సాయంత్రంలోగా అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు మంజూరు చేయాలని, భూ సమస్యలు పరిష్కరించాలని పలువురు వినతిపత్రాలు అందజేశారు. జన్నారం మండలం పొనకల్ గ్రామ శివారులో ఊరచెరువు భూమి కబ్జాపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ముల్కల్ల ప్రభాకర్ కోరాడు.

విచారణ అధికారిని మార్చండి

మంచిర్యాల జిల్లా టీఎన్జీవోస్ హౌసింగ్ సొసైటీ అక్రమాలపై విచారణ అధికారిగా జిల్లా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.హన్మంతరెడ్డిని నియమించారని, ఆయనను మార్చి ఇతర జిల్లాకు చెందిన అధికారిని నియమించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, నాయకులు కలెక్టర్‌ను కోరారు. ప్రస్తుత విచారణ అధికారి గతంలో టీఎన్జీవోస్ హౌసింగ్ సొసైటీ జాయింట్ సెక్రెటరీగా పని చేశారని, ఆ సమయంలో 195నంబరు ప్లాంటు పొందారని, అదే కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగికి విక్రయించినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. వేరే జిల్లా వ్యక్తిని విచారణ అధికారిగా నియమించి నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.

సారూ.. కొడుకు బువ్వ పెడుతలేడు

''నా కొడుకు బువ్వ పెడుతలేడు సారు. ఇంట్లో నుంచి బయటకు గెంటేశారు. సాయి బాబ గుడికాడ దాతలు అన్నం పెడుతుంటే అక్కడ కూడా బువ్వ పెట్టొద్దని నా చిన్న కొడుకు బెదిరించిండు.. కరీంనగర్‌లో నా బిడ్డ దగ్గర ఉంటున్న. అల్లుడు చనిపోయిండు. బిడ్డకు కష్టంగానే ఉంది. నేను ఎక్కడ బతుకుడు సారు.. తిండి పెట్టేలా చూడండి సారూ..'' అంటూ మంచిర్యాలకు చెందిన గడుప బాణమ్మ కలెక్టర్ కుమార్ దీపక్‌ను వేడుకుంది. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో రోదిస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. తనకు ఇద్దరు కుమారులు రాజేందర్, క్రిష్ణ, కూతురు ఉన్నారని తెలిపింది. భర్త పోషం పదేళ్ల క్రితం చనిపోయాడని, చిన్న కొడుకు చిన్నప్పుడు దత్తత పోయి మళ్లీ తమ దగ్గరికి వచ్చాడని పేర్కొంది. ఉన్న ఆస్తి కొడుకులకు ఇచ్చామని, అన్నదమ్ముల మధ్య గొడవతో పెద్ద కొడుకు హైదరాబాద్‌లో కిరాయికి ఉంటున్నాడని తెలిపింది. చిన్న కొడుకు మంచిర్యాలలో ఉంటున్నా బువ్వ పెట్టకుండా గెంటేశాడని, తల్లివి కావు, దగ్గరికి రావొద్దంటున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. వృద్ధురాలి కొడుకును పిలిపించి మాట్లాడాలని మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావును కలెక్టర్ ఆదేశించారు.

రోడ్డు మూసేశారు..



జైపూర్ మండలం టేకుమట్ల రైతులం గతంలో ఎస్టీపీపీ, ఇందారం ఓపెన్‌కాస్టు కోసం విలువైన వ్యవసాయ భూములు కోల్పోయాం. ఇప్పుడు నేషనల్ హైవే కోసం భూములు కోల్పోతున్నాం. మా వ్యవసాయ పొలాలకు వెళ్లకుండా నేషనల్ హైవే నిర్మాణదారులు రోడ్డు మూసేశారు. ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు వెళ్లే వీలు లేకుండా పోయింది. రోడ్డు కింది నుంచి వెళ్లేలా బ్రిడ్జి నిర్మాణం, ఇరువైపుల సర్వీసు రోడ్డు నిర్మించాలి.

– బాధిత రైతులు, టేకుమట్ల

అటవీ అధికారుల దాడులు



గత 19 ఏళ్ల నుంచి తాండూర్ మండలం కిష్టంపేట గ్రామ శివారులో సర్వే నంబరు–12లో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాం. గతేడాది నుంచి అటవీ అధికారులు విత్తనాలు వేసుకోకుండా, సాగు చేసుకోనివ్వకుండా అడ్డుకుంటున్నారు. భూమిలోకి వెళ్తే దాడులు చేస్తున్నారు. వ్యవసాయంతోనే కుటుంబ గడిచేది. అటవీ అధికారుల దౌర్జన్యం అడ్డుకుని సాగు చేసుకునే అనుమతి ఇవ్వాలి. – మహిళా రైతులు, గ్రామం: కిష్టంపేట, మం: తాండూర్

ఆటో స్టాండ్ స్థలం కోసం ధర్నా



బెల్లంపల్లిలోని ఆటో యూనియన్ స్థలాన్ని ఇతరులకు కేటాయించొద్దని ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సింగరేణి కాలరీస్ కంపెనీ ఆదీనంలోని జీఎం కార్యాలయం పక్కన, మార్కెట్ ఏరియా స్థలంలో 25ఏళ్లుగా ఆటో స్టాండ్ ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. స్వచ్ఛంద సంస్థకు కేటాయిస్తూ బెల్లంపల్లి ఆర్డీవో చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఆటోలు నిలిపేందుకు స్థలం ఇప్పించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ, వివిధ గ్రామాల ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

'పరిషత్' ఎన్నికల సందడి

- మంత్రి 'పొంగులేటి' ప్రకటనతో జోష్
- జిల్లాలో 129 ఎంపీటీసీ, 16 జెడ్పీటీసీ స్థానాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పల్లెల్లో మళ్లీ స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. తాజాగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటన ఇటు అధికార పార్టీలో అటు ప్రతిపక్ష పార్టీల్లో జోష్ నింపింది. ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఆ తర్వాత సర్పంచ్ ఎన్నికలు ఉంటాయని ప్రకటించారు. దీంతో ఎన్నికల్లో పోటీకి ఎదురుచూస్తున్న ఆశావహులు పావులు కదుపుతున్నారు.

పూర్తయిన ఏర్పాట్లు

ఇప్పటికే పరిషత్ ఎన్నికల సామగ్రి జిల్లాకు చేరగా.. మండలాల వారీగా సిద్ధం చేసి పోలింగ్ కేంద్రాలను ఖరారు చేశారు. పార్టీ గుర్తుపై ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరుగనున్నాయి. గత ఏడాది జూలై 2తో ఎంపీటీసీలు, 3వ తేదీతో జెడ్పీటీసీల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన సాగుతోంది. ఇక పంచాయతీల్లోనూ ఏడాదిగా ప్రత్యేక అధికారుల పాలన సాగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రం నుంచి 15వ ఆర్థిక సంఘం, రాష్ట్రం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోంది.

129 ఎంపీటీసీ.. 16 జెడ్పీటీసీ..

ఒక్కో మండలంలో కనీసం ఐదు ఎంపీటీసీ స్థానాలు ఉండాలనే నిబంధనతో పునర్విభజన చేపట్టగా.. జిల్లాలో 129 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. గణాంకాల ప్రకారం రెండు స్థానాలు పెరిగిన మంచిర్యాల మున్సిపల్ మున్సిపల్ కార్పొరేషన్ విస్తరణతో హాజీపూర్ మండలంలోని మూడు ఎంపీటీసీ స్థానాలు విలీనం అయ్యాయి. జిల్లాలో 16 జెడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. ఇప్పటికే ఖరారైన గ్రామ పంచాయతీ ఓటరు జాబితా ప్రకారం పరిషత్ ఎన్నికలు నిర్వహిస్తారు. గతంలో 600 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఉండగా.. 700 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. గత ఎన్నికల్లో 745 పోలింగ్ కేంద్రాలు ఉండగా, మూడు ఎంపీటీసీ స్థానాలు తగ్గడం, 700 మంది ఓటర్లకు ఒక కేంద్రం ఏర్పాటుతో పోలింగ్ కేంద్రాల సంఖ్య తగ్గనున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 3,777 బ్యాలెట్ బాక్సులతో ఎన్నికలు నిర్వహిస్తారు. నోటిఫికేషన్ విడుదలైతే ఎన్నికల సిబ్బంది నియామక ప్రక్రియ వేగవంతం అయ్యే అవకాశం ఉంది. రిజర్వేషన్లపై ఎలాంటి ప్రకటన రాకపోవడంతో సందిగ్ధం నెలకొంది. బీసీ రిజర్వేషన్ల అంశంతో ఆశావహులు ఇప్పటి నుంచి క్షేత్రస్థాయిలో కీలకంగా వ్యవహరిస్తూ ఎమ్మెల్యేను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. అధికార కాంగ్రెస్ పార్టీ పట్టు నిలుపుకోవాలని చూస్తుండగా, బీఆర్ఎస్, బీజేపీ నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.



మంచిర్యాల జిల్లా పరిషత్ కార్యాలయం

రైతులకు చేరువలో ప్రభుత్వం

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



సీఎం ప్రసంగం వింటున్న కలెక్టర్, అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రైతునేస్తం ద్వారా ప్రభుత్వం రైతులకు మరింత చేరువ అవుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి వర్చువల్ విధానం ద్వారా రైతువేదికల్లో రైతునేస్తం–రైతుభరోసా కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. హాజీపూర్ మండలం ముల్కల్ల రైతువేదికలో కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులు, రైతులు హాజరయ్యారు. సీఎం మాట్లాడుతూ ప్రతీ మంగళవారం రైతువేదికల ద్వారా రైతుల సమస్యలు తెలుసుకుంటూ సాగుపై సూచనలు చేసేలా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. మరో తొమ్మిది రోజుల్లో రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందిస్తామని అన్నారు. ధాన్యం కొనుగోళ్లు, రేషన్ కార్డుల జారీ, సన్నరకం బియ్యానికి బోనస్ అమలు జరుగుతుందని తెలిపారు. కలెక్టర్ కుమార్‌దీపక్ మాట్లాడుతూ సాగులో మెళకువలు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో సూచనలు అందేలా చూస్తామని తెలిపారు. డీఆర్‌డీఓ కిషన్, తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, ఏఓ కృష్ణ, ఏఈఓ మౌనిక, ఆత్మ చైర్మన్ మురళి పాల్గొన్నారు.

కిష్టంపేటలో..

తాండూర్: మండలంలోని కిష్టంపేట రైతువేదికలో సోమవారం రైతునేస్తం సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా వ్యవసాయ అధికారి కల్పన హాజరయ్యారు. ఏవో సుష్మ, డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సల్వాజి మహేందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధికి ఐటీఐ బాటలు

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- జిల్లా వ్యాప్తంగా 1328 సీట్లు
- ఈ నెల 21 తుది గడువు



మంచిర్యాల ఐటీఐ భవనం

మంచిర్యాలఅర్బన్: తక్కువ సమయంలోనే కొలువులు సాధించి స్థిరపడాలనుకునే యువతకు పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ) బాటలు వేస్తోంది. పారిశ్రామిక నైపుణ్యంతో అత్యున్నత స్థాయికి చేరుకునే వీలుంది. మరోవైపు ప్రభుత్వం ఐటీఐల్లో అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్ల(ఏటీసీ) ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. పదో తరగతి విద్యార్థులు 2025–26 విద్యాసంవత్సరంలో ఐటీఐ కోర్సుల్లో చేరికకు దరఖాస్తులు ఆహ్వానిస్తుండగా.. ఈ నెల 21వరకు తుది గడువు విధించింది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో 13,28 సీట్లు ఉండగా.. ఇందులో ప్రభుత్వ ఐటీఐల్లో 732, ప్రైవేటు ఐటీఐల్లో 596సీట్లు ఉన్నాయి. మంచిర్యాలలో 264, మందమర్రిలో 284, శ్రీరాంపూర్‌లో 96, జన్నారంలో 88 సీట్లు ఉన్నాయి. ఏడాది కోర్సులు డీజిల్ మెకానిక్, కంప్యూటర్, వెల్డర్, కోపా, సోలార్ టెక్నీషియన్, రెండేళ్ల కోర్సులు ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, డ్రాఫ్ట్ మెన్ మెకానిక్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, మోటార్ మెకానిక్ కోర్సులు ఉన్నాయి. పదో తరగతి మెమో, ఆధార్‌కార్డు, ఎస్ఎస్‌సీ బోనఫైడ్, కుల ధ్రువీకరణ పత్రం, టీసీతో వెబ్‌సైట్ https://iti.telangana.gov.in/లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

ఏటీసీ కోర్సులు ఇలా..

గత ఏడాది మందమర్రి ప్రభుత్వ ఐటీఐలో ఏటీసీ ప్రారంభించారు. శ్రీరాంపూర్, మంచిర్యాల, జన్నారంలో ఈ ఏడాది అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. మందమర్రిలో ఆరు కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అడ్వాన్స్ సీఎన్‌సీ మెకానిక్ టెక్నీషియన్ 24, ఆర్టిషియన్ యూజింగ్ అడ్వాన్స్‌ టూల్ 20 సీట్లు, బేసిక్ డిజైన్ అండ్ వర్చువల్ వెరిఫైర్ 24 సీట్లు, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్ 40 సీట్లు, మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ 40 సీట్లు, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికల్ 24 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఎన్నో అవకాశాలు



ఐటీఐ శిక్షణతో ఎన్నో ఉద్యోగాలు సాధించవచ్చు. సొంతంగా వర్క్‌షాప్‌లు పెట్టుకుని ఉపాధి కల్పించవచ్చు. తక్కువ సమయంలోనే ఉద్యోగ, ఉపాధి మార్గాలు చూపుతుంది. ఐటీఐ పూర్తి చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పుష్కలమైన అవకాశాలున్నాయి. సింగరేణి, ఎన్టీపీసీ, ఎన్ఎండీసీఎల్, రైల్వే, ఆర్టీసీ, బీహెచ్ఈఎల్, డీఆర్‌డీవో, ఇస్రో వంటి ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ వంటి రక్షణ రంగాల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయి. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ(టామ్‌కామ్) ద్వారా విదేశాల్లో ఉద్యోగాలు సాధించారు.

– రమేష్, ఐటీఐ ప్రిన్సిపాల్, మంచిర్యాల

ఊరిలోనే విత్తనోత్పత్తి

- నకిలీ విత్తనాలకు చెక్ పెట్టేలా ప్రభుత్వం చర్యలు
- గ్రామీణ విత్తనోత్పత్తి పథకానికి శ్రీకారం



చెన్నూర్‌లో విత్తనాలు అందజేస్తున్న డీఏవో(ఫైల్)

చెన్నూర్‌రూరల్: ప్రస్తుత కాలంలో వ్యవసాయ రంగంలో కల్తీ విత్తనాల సమస్య రైతులకు పెను సవాల్‌గా మారింది. కల్తీ విత్తనాలతో పంట దిగుబడి గణనీయంగా తగ్గడమే కాకుండా, రైతులు ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు వ్యవసాయ శాఖ, కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ద్వారా 'గ్రామీణ విత్తనోత్పత్తి పథకం'ను అమలు చేస్తూ రైతులను స్వయం విత్తనోత్పత్తిలో ప్రోత్సహిస్తోంది. ఈ పథకం ద్వారా రైతులు నాణ్యమైన, ధ్రువీకరించిన విత్తనాలను తయారు చేసుకోవడమే కాకుండా, వాటిని ఇతర రైతులకు అందజేస్తూ కల్తీ సమస్యను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

పథకం లక్ష్యాలు

ఈ పథకం ప్రధాన ఉద్దేశం నూతన వంగడాల(రకాల) విత్తనాలను త్వరితగతిన ఉత్పత్తి చేయడం, అధిక దిగుబడినిచ్చే నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావడం. పంటల సరళిని అనుసరించి విడుదలైన నూతన రకాలను ప్రవేశపెట్టడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యం. రైతులు స్వయంగా విత్తనాలను ఉత్పత్తి చేయడంతో కల్తీ విత్తనాల మోసాల నుంచి రక్షణ పొందడమే కాకుండా, నాణ్యత హామీతో పంట సాగు చేయవచ్చు.

అమలు ఇలా..

వ్యవసాయ శాఖ కేవీకే సహకారంతో ఈ పథకాన్ని జిల్లా వ్యాప్తంగా సమర్థవంతంగా అమలు చేస్తోంది. ఈ కార్యక్రమం కింద రైతులకు వరి, పెసర పంటలకు సంబంధించిన విత్తనాలను 100 శాతం సబ్సిడీపై అందజేశారు. జిల్లాలో 650 బస్తాల 10 కిలోల వరి విత్తనాలు, 350 బస్తాల 3 కిలోల పెసర విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. వీటిని అందించేందుకు జిల్లాలోని ఆయా మండలాల్లోని రెవెన్యూ గ్రామాల నుంచి ముగ్గురు రైతుల చొప్పున ఎంపిక చేశారు.

మూడు దశల్లో శిక్షణ..

ఎంపిక చేసిన రైతులకు విత్తనోత్పత్తిపై శిక్షణ ఇస్తారు. విత్తనోత్పత్తి సాంకేతిక పరిజ్ఞానం, విత్తనాల విత్తే దూరం, సాగు పద్ధతులు తెలియజేస్తారు. పూత దశలో కలుపు మొక్కలను గుర్తించి తొలగించడం, సస్యరక్షణ పద్ధతులు, కోత పద్ధతులపై శిక్షణ ఇస్తారు. కోత తర్వాత విత్తనాలను ఇతర పంటలతో కలపకుండా తయారు చేయడం, నిల్వ పద్ధతులపై శిక్షణ ఇస్తారు.

పథకం ప్రయోజనాలు

శిక్షణ పొందిన రైతులు వరి, మినుము, పెసర వంటి పంటలకు మూల విత్తనాలను ఉపయోగించి సాగు చేస్తారు. ఈ విత్తనాలను ఇతర రైతులకు అందజేయడం ద్వారా కల్తీ విత్తనాల సమస్యను గణనీయంగా తగ్గించవచ్చు. అధిక దిగుబడినిచ్చే నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి రావడంతో రైతుల ఆర్థిక స్థితి మెరుగుపడడమే కాకుండా, వ్యవసాయ ఉత్పాదకత కూడా పెరుగుతుంది. గ్రామీణ విత్తనోత్పత్తి పథకం రైతులను స్వావలంబన వైపు నడిపించడంతోపాటు, కల్తీ విత్తనాల సమస్యను అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తోంది.

విత్తనాలు అందిస్తున్నాం..



గ్రామానికి ముగ్గురు రైతులను ఎంపిక చేసి వారికి గ్రామీణ విత్తనోత్పత్తిపై శిక్షణ ఇచ్చి మూల విత్తనాలను అందిస్తున్నాం. విత్తనాన్ని రైతులు వృథా చేయొద్దు. పంటల సాగులో మెలకువలను రైతులు పాటించాలి. వచ్చిన పంటను రైతులు సాధారణ గింజల కింద విక్రయించవద్దు. విత్తనం కిందనే పంటను అమ్మాలి. ఇలా అయితేనే రైతులకు లాభం చేకూరుతుంది.

– బానోతు ప్రసాద్, ఏడీఏ, చెన్నూర్

క్లుప్తంగా

బాలికపై లైంగిక దాడి కేసులో ఒకరి రిమాండ్

జన్నారం: బాలికను కిడ్నాప్‌చేసి లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గొల్లపెల్లి అనూష తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక కనిపించడంలేదని ఈనెల 1న ఓ మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మందపల్లి వాసి మోతే అర్జున్ బాలికను కిడ్నాప్ చేసినట్లు విచారణలో తేలింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితునిపై కిడ్నాప్, రేప్, పోక్సో సెక్షన్ల కింద కేసు నమోదు చేసి లక్సెట్టిపేట కోర్టులో హాజరు పరిచామన్నారు. జడ్జి నిందితునికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు తెలిపారు.

దాడి కేసులో ఇద్దరు..

దండేపల్లి: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన బారతపు సత్తవ్వ, ప్రభాకర్‌పై అదే గ్రామానికి చెందిన బారతపు కుమారస్వామి, లింగయ్య, అమృత, గంగాలక్ష్మి ఈనెల 14న దాడికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా కుమారస్వామి, లింగయ్యను ఆదివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తహసీనొద్దీన్ తెలిపారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

వాంకిడి: ద్విచక్ర వాహనంపై అక్రమంగా తరలిస్తున్న నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. సోమవారం మండలంలోని బంబార గ్రామ శివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మహారాష్ట్ర నుంచి ఆసిఫాబాద్ వైపు వస్తున్న బైక్‌ను తనిఖీ చేయగా 5 కిలోల పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. మహారాష్ట్రలోని రాజూర తాలూకా సుడక్‌పల్లి గ్రామానికి చెందిన మడావి మోతీరాంను అదుపులోకి తీసుకున్నారు. మండల వ్యవసాయ అధికారి గోపీకాంత్ సమక్షంలో పంచనామ నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. తనిఖీల్లో ఏఎస్సై పోషెట్టి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని దాబా(బి)లో సోమవారం నర్వడే ఈశ్వర్ వద్ద 20 నకిలీ పత్తి విత్తన ప్యాకెట్లు పట్టుకున్నట్లు ఏవో భగత్ రమేశ్‌కుమార్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు ఎస్సై పురుషోత్తం, ఆర్‌ఐ హుస్సేన్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఇద్దరు అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని వాల్మీకినగర్‌కు చెందిన ఓ యువతి, యువకుడు అదృశ్యమైనట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఈనెల 15న యువతి తన స్నేహితురాలి ఇంటికి చదువుకోవడానికి వెళ్లి తిరిగి రాలేదు. అదే కాలనీకి చెందిన దిగంబర్ మధ్యాహ్నం స్నేహితుడికి ఇంటికి వెళ్తానని చెప్పివెళ్లి తిరిగిరాలేదు. ఇరువురి తల్లిదండ్రులు వేర్వేరుగా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

తిర్యాణి: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మొర్రిగూడకు చెందిన కుద్మెత దాదాజి (58) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రిలో చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపం చెందాడు. సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుని భార్య సక్కుబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..

కుభీర్: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని నిగ్వా గ్రామానికి చెందిన వాగ్మరే సాయినాథ్ (26)మద్యానికి బానిసయ్యాడు. నిత్యం మద్యం సేవించి ఇంటికి రావడంతో భార్య నిలదీసింది. దీంతో మనస్తాపం చెంది ఆదివారం రాత్రి గడ్డెన్న వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైలు ఢీకొని ఒకరు మృతి

ఆదిలాబాద్‌టౌన్: రైలు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన ఆదిలాబాద్ పట్టణ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. జిల్లా కేంద్రంలోని రిక్షాకాలనీకి చెందిన సంతోష్‌ను గుర్తు తెలియని రైలు ఢీకొట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. గూడ్స్ రైలు పైలెట్ ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఫోన్ చోరీకి యత్నించిన యువకుడు అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: సెల్‌ఫోన్ చోరీకి యత్నించిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్‌లో ఆదివారం సాయంత్రం ఖందేల్వార్ రాజకుమార్ శర్మ అనే వ్యక్తి జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన షారుఖ్ ఖాన్ దొంగిలించేందుకు యత్నించాడు. బాధితుడు వెంటనే అప్రమత్తమై నిందితుడిని పట్టుకొని వన్‌టౌన్‌లో అప్పగించాడు.

భక్తుల భద్రత గోదావరిలో దీపమే!

- ప్రాణాలు పోతున్నా పట్టింపేది?
- కానరాని కనీస రక్షణ చర్యలు
- ఇప్పటికీ ఏర్పాటు చేయని ఇనుప కంచె
- హామీలు నీటి రాతలే!


బాసర వద్ద గోదావరి నది

భైంసా: బాసర వద్ద గోదావరిలో నీటిమట్టం కనిష్ట స్థాయికి చేరింది. దీంతో కొన్నిరోజులుగా భక్తులు స్నానఘట్టాల వద్ద కాకుండా నది పొడవున స్నానాలు చేస్తున్నారు. నదిలో అక్కడక్కడ లోతైన ప్రాంతాలు ఉన్నాయని తెలియక స్నానం చేసేందుకు అందులోకి దిగి మృత్యువాత పడుతున్నారు. బాసర వద్ద గోదావరి నదిలో లోతు తెలిపే హెచ్చరిక బోర్డులు లేవు. భక్తులను అప్రమత్తం చేసే సిబ్బంది కూడా ఉండరు. దీంతో భక్తులు గోదావరి నదిలో దిగి ప్రాణాలు కోల్పోతున్నారు.

పెరుగుతున్న ప్రమాదాలు

పదేళ్ల కాలంలో 127కు పైగా భక్తులు బాసర వద్ద గోదావరిలో నీటమునిగి మృతి చెందారు. 2021లో 10, 2022లో 12, 2023లో 11, 2024లో 10, 2025లో 8 మంది నీట మునిగి మృత్యువాత పడ్డారు. అయినప్పటికీ అధికారులు తేరుకోవడం లేదు. నదిలో నీటి ప్రవాహం తగ్గిన సమయాల్లోనూ మృత్యువాత పడడం కలచివేస్తుంది. భారీ వర్షాలతో నీటి ప్రవాహం పెరిగిన సమయాల్లో నదిలోకి వెళ్లేందుకు ఎవరైనా జంకుతారు. నీటి సామర్థ్యం తగ్గినప్పుడు స్నానాలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తారు. ఈనెల 15న ఆదివారం ఆరుగురు యువకులు ఇసుక తెన్నెల నుంచి లోపలికి వెళ్లి స్నానాలు చేశారు. అందులో ఓ యువకుడు ప్రాణాలతో బయటపడగా రాకేశ్, భరత్, మదన్, వినోద్, రితిక్ అనే యువకులు మృతి చెందారు.

ఆరు నెలలైనా...

గోదావరి నదిలో జరుగుతున్న ప్రమాదాలపై జిల్లా ఎస్పీ జానకీ షర్మిల అప్పట్లో స్పందించారు. గతేడాది డిసెంబర్ 18న భైంసా ఏఎస్పీ అవినాశ్‌తో కలిసి బాసర వంతెన, నది పరీవాహక ప్రాంతాలను పరిశీలించారు. వంతెనలపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు 24 గంటలు పర్యవేక్షించేలా సిబ్బందిని నియమిస్తామన్నారు. రెండు జిల్లాల పోలీసుల సహకారంతో తగిన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లతో పాటు రెండు ద్విచక్ర వాహనాలు, బ్లూ కోర్టు సిబ్బందిని నియమిస్తామని హామీ ఇచ్చారు. ఆరునెలలు గడిచినప్పటికీ ఇప్పటికీ వంతెనపై ఇనుప కంచె ఏర్పాటు చేయలేదు.

స్థానిక యువకులు విన్నవించినా...

దక్షిణ భారతావనిలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసర. అందుకే ఇక్కడికి అధికసంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఇక్కడ తరచూ జరుగుతున్న ప్రమాదాలను నివారించాలని 2022లోనే మిషన్ బాసర యువకులు, మేధావులు, యువజన సంఘాలు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కలిసి అప్పటి ప్రభుత్వానికి, బాసర ఆలయ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. అయినప్పటికీ గోదావరి నదిలో ఏర్పాట్లను ఏ ఒక్కరూ పట్టించుకోవడంలేదు.

ఈ ఏర్పాట్లపై దృష్టి సారించాలి

- నదిలోతును తెలిపే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.
- ప్రమాదాలు జరిగితే అత్యవసర సేవలు అందించేందుకు అంబులెన్సు, వైద్యులు అందుబాటులో ఉండాలి.
- నది నీటిలో నీళ్లు మింగి ఊపిరాడని పరిస్థితిలో ఉన్న వారికి సీపీఆర్ చేస్తే ప్రాణాలతో బయటపడొచ్చు అనే విషయాలు తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలి.
- గోదావరి నదిలో అన్ని స్నానఘట్టాల వద్దకు భక్తులను అనుమతించవద్దు.
- నది నీటిలోతు తెలుసుకుని ఇనుప కంచెలు ఏర్పాటు చేయాలి.
- బాసర ఆలయంతో పాటు ఆలయ అధికారులు గోదావరి నది సమీపంలో వచ్చే భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించాలి.
- ఆలయానికి రెగ్యులర్ ఈవోను నియమించాలి.
- బాసర నదికి వెళ్లే మార్గంలో, ఘాట్లకు వెళ్లే ప్రాంతాల్లో పుణ్యస్నానాలు ఆచరించే ప్రదేశాల్లో, రాత్రి సమయాల్లోనూ కనిపించేలా వీధి దీపాలు ఏర్పాటు చేయాలి.

బాసర గోదావరిని పరిశీలించిన ఎస్పీ

బాసర: బాసర గోదావరినదిని ఎస్పీ జానకీ షర్మిల సోమవారం పరిశీలించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని స్నానఘట్టాల వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. పుష్కర ఘాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.


హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయిస్తున్న ఎస్పీ

భక్తులంతా నదివద్దే...

బాసరకు వచ్చే భక్తులంతా ఎక్కువ సమయం గోదావరి నది వద్దే గడుపుతారు. నదిలో స్నానాలు ఆచరించడం, గంగమ్మ తల్లికి పూజలు చేయడంతో పాటు రెండు వంతెనల పక్కన ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపేందుకే ఇష్టపడుతారు. వచ్చిన వారంతా నదిలో కాసేపు విహరించాలని అనుకుంటారు. నదులు ఉన్న పుణ్యక్షేత్రాల్లో వచ్చే భక్తుల కోసం ఎన్నో ఏర్పాట్లు ఉంటే బాసరలో పరీవాహక ప్రాంతాల్లో శుభ్రత పనులు కూడా కనిపించవు. వసంత పంచమి ఏర్పాట్లలో ఘాట్లు, గోదావరి నదీ తీరం అపరిశుభ్రంగా ఉండడం, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఎమ్మెల్యే రామారావు పటేల్ కార్యకర్తలతో వెళ్లి శుభ్రత పనులు చేపట్టారు. ఇక భక్తులకు కావాల్సిన కనీస వసతులు దేవుడెరుగు. ఆహ్లాదం పంచే గోదావరి నదిలో ఆదివారం వరకు బోట్లు తిప్పారు. లైఫ్ జాకెట్లు లేకుండా భద్రత విషయాలు పరిగణలోకి తీసుకోకుండా బోట్లను నదిలోకి పంపారు. ఈ బోట్లలోనే ఆరుగురు యువకులు నీటిలో నుంచి ఇసుక తెన్నెలకు వెళ్లి ప్రమాదాల భారిన పడ్డారు. ఒకే రోజు ఐదుగురు యువకులు గోదావరి నదిలో మృతి చెందడంతో జిల్లా రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ అభిలాషఅభినవ్ ఆదేశాలతో భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి పరిస్థితిని తెలుసుకున్నారు. సోమవారం నుంచి బోటింగ్‌ను నిలిపివేశారు.

15 వేలకు చేరిన దరఖాస్తులు


బాసర ట్రిపుల్‌ఐటీ

భైంసా: ఆర్జీయూకేటీలో ప్రవేశానికి గత నెల 31 నుంచి టీఎస్ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జూన్ 21 వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు విధించారు. సోమవారం నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 15,015 దరఖాస్తులు వచ్చినట్లు వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ వెల్లడించారు. 2025–26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వం 1500 సీట్లను కేటాయించింది. జూన్ 21 వరకు ఈ సంఖ్య మరింత పెరుగుతుందని ట్రిపుల్‌ఐటీ అధికారులు చెబుతున్నారు.

వైద్య కళాశాలకు మృతదేహం అప్పగింత


మాట్లాడుతున్న నారాయణ

ఆదిలాబాద్‌టౌన్: బోథ్ మండల కేంద్రానికి చెందిన అంకుష్ గౌరు (90) వృద్ధాప్యంతో ఆదివారం మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు నారాయణ వృత్తిరీత్యా కండక్టర్ కాగా నిర్మల్‌లో నివాసం ఉంటున్నాడు. తల్లి నిర్మల్‌లో మృతి చెందడంతో సంప్రదాయ బద్ధంగా అంతిమ సంస్కారం నిర్వహించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని రిమ్స్ వైద్య కళాశాలలో సోమవారం మృతదేహాన్ని అప్పగించారు. అవయవదానం, శరీర దానం చేస్తే మెడికోలకు ప్రాక్టీస్‌తో పాటు పేద ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

సైబర్ బాధితులకు నగదు అందజేత

- ఎస్పీ అఖిల్ మహాజన్


ఎస్పీని సన్మానిస్తున్న సైబర్ బాధితులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఈ నెలలో పది కేసుల్లో సైబర్‌క్రైమ్ బాధితులకు తిరిగి డబ్బులు అందించామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఐదుగురు బాధితులు ఎస్పీని కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యాపల్‌గూడకు చెందిన నర్సింగ్ గతేడాది రూ.16,901 కేవైసీ అప్‌డేట్ లింక్ ఓపెన్ చేయడంతో పోగొట్టుకున్నారని, జైనథ్ మండలానికి చెందిన లింగారెడ్డి గూగుల్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమర్ కేర్ సర్వీస్ ఫేక్ నంబర్ ఓపెన్ చేసి రూ.2లక్షల 15వేలు పోగొట్టుకోవడంతో రూ.లక్షా 30వేలు తిరిగి అకౌంట్‌లో వేయించామన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన జి.రమేశ్ ఫ్రాడ్ ఇన్వెస్ట్‌మెంట్‌లో సైబర్ నేరగాళ్లు రూ.లక్షా 59వేలు కాజేయగా రూ.60వేలు ఇప్పించామన్నారు. మావలకు చెందిన మిథిలి అనే మహిళ సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్ ద్వారా స్నేహితుడిగా సహాయం కోరిన వెంటనే రూ.25వేలు పంపించడంతో తిరిగి వాటిని సైతం ఇప్పించినట్లు తెలిపారు. ఉట్నూర్‌కు చెందిన ప్రభుత్వ ఉద్యోగి స్టాక్ మార్కెట్‌లో దాదాపు రూ.3లక్షలు పోగొట్టుకోగా రూ.50 వేలు కోర్టు ద్వారా అందించినట్లు వివరించారు. సైబర్ క్రైమ్‌కు గురైన బాధితులు వెంటనే 1930, పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు


గాయపడిన అశోక్


ఆస్పత్రిలో గంగుబాయి

నిర్మల్ రూరల్: నిర్మల్ మండలం చిట్యాల వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. రూరల్ ఎస్సై లింబాద్రి కథనం ప్రకారం....భైంసా పట్టణంలోని అశోక్ నగర్ కాలనీకి చెందిన దివిటికర్ గంగుబాయి ఆమె భర్త బాబు, పింగువ అశోక్, సాయిపుత్ర ప్రజావాణిలో అర్జీలు అందజేసేందుకు ఆటోలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు బయలుదేరారు. చిట్యాల బ్రిడ్జి వద్దకు రాగానే నిర్మల్ నుంచి భైంసా వైపు వెళ్తున్న డీసీఎం అతివేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో పల్టీలు కొట్టి పంట పొలాల్లో పడిపోయింది. ఆటోలో ఉన్న గంగుబాయి, అశోక్, బాబు, డ్రైవర్ సాయిపుత్రకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి పోలీసులకు, 108కు సమాచారం ఇచ్చారు. ఎస్సై లింబాద్రి సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన డీసీఎం వ్యాన్ డ్రైవర్ చేతన్ ప్రకాష్ మీనన్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పింఛన్ కోసం మొరపెట్టుకుందామని..

భైంసాటౌన్: పింఛన్ కోసం కలెక్టర్‌కు మొరపెట్టుకుందామని వెళ్లిన వృద్ధ దంపతులతో పాటు వారికి సహాయం చేద్దామని వెళ్లిన ఓ దివ్యాంగుడు, ఆటో నడుపుతున్న డ్రైవర్ రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యారు. భైంసా పట్టణంలోని పిప్రికాలనీకి చెందిన దివిటికర్ గంగుబాయి, ఆమె భర్త బాబు పింఛన్ లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో, కలెక్టర్‌కు మొరపెట్టుకుందామనుకున్నారు. సోమవారం ప్రజావాణి ఉండడంతో సహాయంగా దివ్యాంగుడైన అశోక్ పింగ్లేను తోడుగా తీసుకుని ఆటోలో డ్రైవర్‌తో కలిసి నిర్మల్ బయలుదేరారు. నిర్మల్ మండలంలోని చిట్యాల బ్రిడ్జి వద్దకు రాగానే నిర్మల్ నుంచి భైంసా వైపు వెళ్తున్న డీసీఎం ఆటోను ఢీకొని ఆటోలోని నలుగురూ తీవ్ర గాయాలపాలయ్యారు. పింఛన్ కోసం అధికారులకు మొరపెట్టుకుందామని బయలుదేరిన వారికి రోడ్డు ప్రమాదం రూపంలో గాయాలే మిగిలాయి.

భార్యను హత్య చేసిన భర్తకు ఆరేళ్ల జైలు

నిర్మల్‌టౌన్: భార్యను హత్య చేసిన భర్తకు ఆరేళ్ల జైలు, జరిమానా విధిస్తూ సోమవారం నిర్మల్ న్యాయస్థానం తీర్పునిచ్చింది. కోర్టు సమన్వయల అధికారి డల్లు సింగ్ తెలిపిన వివరాల ప్రకారం ..2021లో బాసర మండల కేంద్రానికి చెందిన పాలకర్ సాయినాథ్ క్షణికావేశంలో కట్టుకున్న భార్యపై కిరోసన్ పోసి తగలబెట్టాడు. భార్య చనిపోతూ ఇచ్చిన మరణ వాంగ్మూలంతో పోలీసులు కేసు నమోదు చేసి, పరిశోధన అనంతరం చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ మేరకు జిల్లా జడ్జి శ్రీవాణి నిందితునికి ఆరు సంవత్సరాల జైలుశిక్ష,రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

నేరం చేసిన వారు తప్పించుకోలేరు

నేరం చేసిన వారు శిక్ష నుంచి తప్పించుకోలేరని ఎస్పీ జానకీ షర్మిల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిర్మల్ పోలీసులు ప్రాసిక్యూషన్ వారి వ్యూహంతో న్యాయ విచారణ, నిరూపణ జరిపి ఖచ్చితంగా శిక్ష పడేలా చేస్తారని సూచించారు. నిందితునికి శిక్ష పడడంలో కృషిచేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ వినోద్‌రావు, విచారణ అధికారి ఎస్సై తోట మహేష్, కోర్టు సమన్వయల అధికారి డల్లు సింగ్‌ను అభినందించారు.

డివైడర్‌ను ఢీకొని ఒకరికి గాయాలు

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. నిజామాబాద్ జిల్లా ఎర్గాట్ల మండల కేంద్రానికి చెందిన ముగ్గురు యువకులు ఆదివారం బైక్‌పై నిర్మల్‌కు వచ్చారు. తిరుగుప్రయాణంలో కనకాపూర్ చౌరస్తాలో డివైడర్‌ను ఢీకొట్టారు. ఘటనలో రవికి తీవ్రగాయాలు కాగా నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

రెప్పపాటులో.. రెండు ప్రాణాలు

దైవ దర్శనానికి వెళ్లి మొక్కులు తీర్చుకున్న ఆ కుటుంబ సభ్యులు తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. మరికాసేపట్లో ఇంటికి చేరుకునే క్రమంలో వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి చెట్టును ఢీకొంది. అప్పటివరకు సంతోషంగా గడిపిన వారంతా చెల్లాచెదురయ్యారు. ఏం జరిగిందో తెలుసుకునేలోపే ఇద్దరు తనువు చాలించారు. ఈ ఘటనలో అమ్మమ్మ, మనుమడు మృతి చెందగా మనవరాలి పరిస్థితి విషమంగా ఉంది. బాధిత కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

- రోడ్డు ప్రమాదంలో అమ్మమ్మ, మనుమడు దుర్మరణం
- ఉట్నూర్‌లోని బీర్సాయిపేట వద్ద చెట్టును ఢీకొట్టిన కారు
- మరో చిన్నారి పరిస్థితి విషమం


కారులో విజయ మృతదేహం


గంట విజయ (ఫైల్)


ఈర్ల సాహర్ష్ (ఫైల్)


సంఘటన స్థలంలో కూతురితో సృజనిత

ఆదిలాబాద్‌టౌన్/ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన ఈర్ల రాజు డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తున్నాడు. రెండో శనివారం, ఆదివారం సెలవు రోజులు కావడంతో అతని భార్య సృజనిత, కుమారుడు సాహర్ష్(15), కుమార్తె ఆద్యశ్రీతో పాటు సృజనిత తల్లి గంట విజయ(55)తో కలిసి దైవదర్శనం చేసుకునేందుకు శుక్రవారం జిల్లా కేంద్రం నుంచి కారులో బయల్దేరి వెళ్లారు. కాళేశ్వరం, ధర్మపురి, ఇతర దేవాలయాలను దర్శించుకున్నారు. అనంతరం బెల్లంపల్లిలో నివాసం ఉంటున్న సృజనిత అక్క ఇంటికి వెళ్లారు. ఆదివారం అక్కడే ఉన్నారు. సోమవారం ఉదయం 6:30 గంటల ప్రాంతంలో బయలుదేరారు. మార్గమధ్యలో ఉట్నూర్ మండలంలోని బీర్సాయిపేట్ మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. సాహర్ష్, విజయ సంఘటన స్థలంలోనే మృతి చెందగా ఆద్యశ్రీ తలకు తీవ్రగాయాలయ్యాయి. ముందుగా రిమ్స్ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు పేర్కొన్నారు. రాజు, సృజనిత గాయాలతో బయటపడ్డారు. కారు డ్రైవర్ రాజుకు కునుకు రావడంతోనే ఈ ప్రమా దం జరిగి ఉండవచ్చని పలువురు పేర్కొంటున్నారు. ఉట్నూర్ ఎస్సై మనోహర్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మిన్నంటిన రోదనలు..

రోడ్డు ప్రమాదం విషయం తెలియడంతో బాధిత కుటుంబీకులు, బంధువులతో పాటు కాలనీవాసులు అధికసంఖ్యలో రిమ్స్ ఆస్పత్రితో పాటు వారి నివాసానికి చేరుకుని చేసిన రోదనలు మిన్నంటాయి. ఉన్న ఇద్దరు పిల్లల్లో ఒకరు మరణించగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉండడంతో తల్లిదండ్రులు గుండెలు పగిలేలా ఏడ్చారు. వారిని ఓదార్చడం ఎవరితరం కాలేదు. బడులు ప్రారంభం కావడంతో పిల్లలు తరగతులు నష్టపోతారని హడావుడిగా తీసుకువస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సాహర్ష్ జిల్లా కేంద్రంలోని రిజోనెన్స్ పాఠశాలలో పదో తరగతి, ఆద్యశ్రీ అదే పాఠశాలలో ఏడోతరగతి చదువుతున్నారు. విషయం తెలుసుకున్న పాఠశాల యాజమాన్యం, తోటి స్నేహితులు కన్నీరు మున్నీరయ్యారు.

పలువురి పరామర్శ..

రోడ్డు ప్రమాదం విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ రిమ్స్ ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ, కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న బాధిత కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సిర్పూర్(యూ) మండలం పాములవాడకు చెందిన పెందూర్‌శంకర్ తమ గ్రామానికి సీసీ రోడ్డు మంజూరు చేయాలని, రెబ్బెన మండలం గోలేటికి చెందిన లక్ష్మి తనకు పట్టా ఇప్పించాలని, ఆసిఫాబాద్ మండలం కమ్మర్‌గావ్‌కు చెందిన పృథ్వీరాజ్ తనకు గురుకులంలో అడ్మిషన్ ఇప్పించాలని కోరారు. ఇంకా వివిధ సమస్యలపై అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీవో మెస్రం మనోహర్, డీడీ అంబాజీరావు, పీహెచ్‌వో సందీప్, ఏడీ ఎంఅండ్‌హెచ్‌వో మనోహర్, ఏవో దామోదర స్వామి, మేనేజర్ శ్యామల, డీపీవో ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తవ్వకాలు


విరిగిన దేవతామూర్తి విగ్రహం

కడెం: మండలంలోని దోస్తనగర్ సమీపంలో కొండపై వెలసిన శ్రీనల్లగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన ఘటన వెలుగులోకి వచ్చింది. దస్తురాబాద్‌కు చెందిన అర్చకుడు నరేశాచార్యులు సోమవారం భక్తులు, అర్చకులతో కలిసి ఆలయానికి వెళ్లగా పరిసరాల్లో విరగగొట్టిన ద్వార మూర్తి విగ్రహం, అరబిక్ భాషతో కూడిన ఇత్తడి కడ్డీలు, తట్ట, పార కనిపించాయి. పడేసిన విగ్రహాలకు సంప్రోక్షణ, శాంతిపాఠం, నారసింహ పారాయణం జరిపించి పునఃప్రతిష్ఠించారు. ఒకటి రెండు రోజుల వ్యవధిలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు భావించారు.

క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న కోచ్ ప్రదీప్

మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా అండర్–19 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు మంచిర్యాల పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం నిర్వహించారు. రెడ్, గ్రీన్ టీంలకు 50 ఓవర్ల మ్యాచ్‌ను కోచ్ ప్రదీప్, సీనియర్ క్రికెటర్లు గోదావర్తి, చందు ప్రారంభించారు. గ్రీన్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుని 13.4 ఓవర్లలో 60 పరుగులు చేసి ఆలౌట్ కాగా రెడ్ జట్టు కేవలం 1 వికెట్‌ను కోల్పోయి 11.1 ఓవర్లలో 61 పరుగులు చేసి 9 వికెట్ల తేడాతో గెలుపొందింది.